

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

రాజమహేంద్రవరం | మంగళవారం 17 నవంబర్ 2026 | I



భరోసా కరువాయే..

అమలాపురంలో వైకాపా శ్రేణుల ఆవేదన..

నాయకత్వం లేమిపై నిరాశతో స్థానిక నేతలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,నవంబర్16, ప్రభాతవార్త. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి, క్షేత్రస్థాయిలో కష్టపడిన కార్యకర్తలకు అండగా నిలవాల్సిన కీలక తరుణంలోనే నాయకత్వం నుంచి భరోసా కరువైందని అమలాపురం వైకాపా స్థానిక నేతలు, కార్యకర్తలు వాపోతున్నారు. ఎన్నాళ్లుగానో ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న వారికి దిశానిర్దేశం చేసేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నేటి వరకు వైకాపా నాయకులు పోటీకి దూరంగా ఉండడం పూర్తిగా నాయకత్వ లోపమేనని వారు మండిపడుతున్నారు. ముందుండి నడిపించే నాయకుడు లేక శ్రేణులు విలవిల్లాడిపోతున్నాయి. మొన్న జరిగిన ఎంపీటీసి ఎన్నికల్లోనూ ఇదే తూతూ మంత్రపు ధోరణి కొనసాగిందని విమర్శించారు.

మా కష్టాన్ని గాలికొదిలేశారు....

పార్టీ కోసం రాత్రింబవళ్లు ఎంత కష్టపడ్డాం? అలాంటిది నేడు మా కష్టం గాలికొదిలేసి, కష్టకాలంలో మా కోసం ముందుకు రావడం లేదు" అంటూ స్థానిక నాయకులు బోరున విలపిస్తున్నారు. కనీసం తమగోడు వెళ్లబోసుకుందామన్నా నాయకుల జాడే కనిపించడం లేదని వాపోయారు. "ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో మాకు దిక్కెవరు?" అంటూ శ్రేణులు కన్నీటి పర్యంతమవుతున్నాయి. పలు చోట్ల ఎన్నికల బరి నుంచి వైకాపా నాయకులు పూర్తిగా తప్పుకోవడం అమలాపురంలో ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా అధిష్టానం స్పందించి, ధైర్యం చెప్పే నాయకులను ముందుకు తీసుకురావాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

కార్తీక సోమవారం.. వాడపల్లికి పోటెత్తిన భక్తులు!







ఆత్రేయపురం, నవంబర్ 16 (ప్రభాత వార్త): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం కార్తీక మాసం తొలి సోమవారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. లక్ష్మీ ఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, నిత్యకల్యాణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కోరుకొల్లు గ్రామానికి చెందిన సన్నిధి వంశీ సాయిరామ్ సత్య మణికంఠ కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ.57,211 విరాళంగా అందజేశారు. దాతలను ఆలయ అధికారులు శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్తిక రద్దీకి పాదగయ సిద్ధం కావాలి!

భక్తులకు ఇబ్బందులొస్తే సహించేది లేదు

మౌలిక వసతులపై పాడా పీడీ క్షేత్రస్థాయి తనిఖీ





పిఠాపురం, నవంబర్ 16 (ప్రభాతవార్త) కార్తిక మాసంలో పాదగయకు తరలివచ్చే భక్తులకు కనీస సౌకర్యాల కొరత లేకుండా చూడాలని పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శివరాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పారిశుద్ధ్యం నుంచి తాగునీటి సరఫరా వరకు ప్రతి ఏర్పాటూ పక్కాగా ఉండాలని, విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశిస్తూ మంగళవారం పాదగయ క్షేత్రాన్ని సందర్శించి ఏర్పాట్లపై క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త తొలగింపు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించారు. కార్తిక మాసంలో భక్తుల రాకపోకలు పెరిగే నేపథ్యంలో ఆలయ పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సదుపాయాల్లో అంతరాయం లేకుండా చూడాలన్నారు. భక్తులకు పరిశుభ్రమైన, సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని శివరాం ప్రసాద్ స్పష్టం చేశారు. ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.రి

పశుసంవర్ధక శాఖ పి.పి.ఆర్ టీకాలు



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,నవంబరు16,ప్రభాతవార్త. అమలాపురం మండలం, పాలగుమ్మి గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో డా. ఎల్. విజయరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్, యానిమల్ హస్బండ్రీ, అమలాపురం పర్యవేక్షణలో పి.పి.ఆర్ టీకాల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 3 నెలల వయస్సు పైబడిన మొత్తం 220 గొర్రెలు / మేకలకు పి.పి.ఆర్ టీకాలు వేయడం జరిగింది. డేటా ఎంట్రీ ఏకకాలంలో ఆన్‌లైన్‌లో పూర్తి చేయడం జరిగింది.

పి.పి.ఆర్ వ్యాధి లక్షణాలు...

అధిక జ్వరం104 106ఫీఎఫ్ వరకు జ్వరం రావడం, కళ్ళు,ముక్కు నుండి నీరు / చీము కారడం,నోటి చుట్టూ, చిగుళ్ళపై పుండ్లు,దగ్గు,శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుంటాయి.తీవ్రమైన విరేచనాలు,నీళ్ళ విరేచనాలు, మేత మానేయడం,నీరసంగా ఉండడం,బరువు తగ్గడం,చిన్న గొర్రెలు / మేక పిల్లల్లో ఎక్కువగా మరణాలు సంబవిస్తుంటాయన్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని పశు వైద్యశాలను సంప్రదించాలని, వ్యాధి సోకిన మేకలను /గొర్రెలను విడిగా ఉంచాలని రైతులకు సూచించడం జరిగింది. అలాగే సమయానికి టీకాలు వేయించడం, సరైన పోషణ, పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు కరుణ,జీవాల పెంపకందార్లు పట్టాపగలు వెంకటేశ్వరరావు, మాచరయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌గా ఇళ్ళ నామినేషన్



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,నవంబరు16, ప్రభాతవార్త. అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ప్రముఖులు ఇళ్ల సత్య గోపాలకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు.గ్రామాభివృద్ధే తన లక్ష్యం అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆయన నామినేషన్ దాఖలు సందర్భంగా పలువురు నేతలు తమ సంఘీభావం తెలిపారు

నగరాల్లో ముగిసిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ..

చివరిరోజు భారీగా నామినేషన్లు దాఖలు...

మేయర్ స్థానానికి కాకినాడ లో 28....

రాజమహేంద్రవరంలో..25. కార్పోరేటర్ స్థానాలకు కాకినాడ...840

రాజమహేంద్రవరంలో...635.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,నవంబరు16,ప్రభాతవార్త. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిదిలోని కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో జరుగుతున్న కార్పొరేషన్ ఎన్నికల్లో మొదటి ఘట్టం ముగిసింది. నామినేషన్ల దాఖలు గడువు ముగియడంతో మంగళవారం కాకినాడ ,రాజమహేంద్రవరం కార్పొరేషన్ అభ్యర్థుల నామినేషన్లను పరిశీలన చేయనున్నారు. మూడు రోజుల్లో చివరి రోజు భారీ గా నామినేషన్లు దాఖలు చేశారు.రాజమండ్రి నగరపాలక సాధారణ ఎన్నికలకు సంబంధించి 72 డివిజన్లకు సంబంధించి కార్పొరేటర్ సభ్యుల స్థానాలకు 635 నామినేషన్ లు దాఖలు అయినట్లు వెల్లడించారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 19 వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు సమయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ గడువు ముగిసిన తర్వాత పోటీలో ఉన్న తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించడం జరుగుతుందని తెలియజేశారు.

అక్వాన్ తుఫాను ముప్పు..

ఏజెన్సీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నేటి నుంచి 20 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం

అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు వద్దు.. వాగులు, వంకలు దాటొద్దు

జిల్లా, డివిజన్, మండల స్థాయిలో 24 గంటల కంట్రోల్ రూమ్‌లు



జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

పోలవరం జిల్లా ప్రతినిధి, నవంబర్ 16, ప్రభాత వార్త: బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుఫాను ప్రభావంతో పోలవరం జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సూచించారు. నవంబర్ 17 నుంచి 20వ తేదీ వరకు తుఫాను ప్రభావం ఉండే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.ముఖ్యంగా రంపచోడవరం, మారేడుమిల్లి, వై.రామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, రాజమొమ్మంగి, దేవీపట్నం మండలాలతో పాటు చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని, పొంగిపొర్లే వాగులు, వంకలు, నదులు, లోతట్టు వంతెనలు, కాజ్‌వేలపై రాకపోకలు సాగించరాదని హెచ్చరించారు. గోదావరి, శబరి, సీలేరు నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు, భూపతిపాలెం జలాశయ పరిసర ప్రాంతాల వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, పెద్ద చెట్ల సమీపంలో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే అధికారుల సూచనల మేరకు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని తెలిపారు.

12 మండలాల్లో 24 గంటల కంట్రోల్ రూమ్‌లు

తుఫాను ముప్పును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్, సబ్ కలెక్టరేట్లు, రంపచోడవరం, చింతూరు డివిజన్లతో పాటు మొత్తం 12 మండలాల్లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పోలీస్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలు, అత్యవసర మందులు, జేసీబీలు, నిత్యావసర సరుకులు సిద్ధంగా ఉంచాలని సూచించారు.

రైతులు పంటలను కాపాడుకోవాలి

రైతులు కోతకు సిద్ధంగా ఉన్న వరి, ఉద్యానవన పంటలను సురక్షితంగా భద్రపరచుకోవాలని, కోసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలతో కప్పి ఉంచాలని సూచించారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువలను సిద్ధం చేసుకోవాలని, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. తెగిపడిన విద్యుత్ తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తాకరాదని, వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే నిర్ధారణలేని వార్తలు, వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్నే అనుసరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అత్యవసర సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్

తుఫాను సమయంలో అత్యవసర సహాయం, రక్షణ చర్యల కోసం రంపచోడవరం జిల్లా అత్యవసర ఆపరేషన్ కేంద్రం టోల్ ఫ్రీ నంబర్ 1800-425-4225ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

ఘనంగా పోలిశెట్టి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు



రామచంద్రపురం,నవంబరు 16 (ప్రభాతవార్త): నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్,కూటమి సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం,మున్సిపల్ ఛైర్మన్ మేడిశెట్టి శేషారావు,ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ తదితరులు కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ఐక్యత,పార్టీ బలోపేతం,ప్రజా సంక్షేమం కోసం చంద్రశేఖర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ఆయన కీలకంగా పనిచేశారని కొనియాడారు.వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ చంద్రశేఖర్ కలుపుగోలుతనం, నాయకత్వ లక్షణాలతో అందరినీ కలుపుకొని ముందుకు సాగుతున్నారని అన్నారు.ఆయనకు ఆయురారోగ్యాలు,మరిన్ని విజయాలు కలగాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో నియోజకవర్గానికి చెందిన కూటమి పార్టీ జనసేన నాయకులు,సైనికులు అధిక సంఖ్యలో పాల్గొని చంద్రశేఖర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవెల్లి శివ,ఏఎంసీ డైరెక్టర్ నారపురెడ్డి బలరాం,క్లస్టర్-2 ఇన్‌ఛార్జి కంచుమర్తి బాబురావు,పలువురు కౌన్సిలర్లు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

కోలమూరులో కూటమి అంతా నా వైపే.. 26న విజయోత్సవం ఖాయం

వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో నామినేషన్ దాఖలు చేసిన పిన్నమరెడ్డి ఈశ్వరుడు

ప్రత్యర్థి ఆరోపణలను ప్రజలు నమ్మడం లేదు



రాజమహేంద్రవరం అర్బన్/రూరల్, నవంబరు 16, ప్రభాతవార్త: కోలమూరు గ్రామంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజల మద్దతు తనకే ఉందని కూటమి మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన పిన్నమరెడ్డి ఈశ్వరుడు ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 26న జరిగే ఎన్నికల్లో విజయం సాధించి విజయోత్సవం నిర్వహించుకోవడం ఖాయమని ప్రకటించారు. సోమవారం రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి భారీ ఊరేగింపుగా వెళ్లిన ఈశ్వరుడు పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి వేలాదిమంది ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావడం తనపై ఉన్న ఆదరణకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా తన విజయానికి కృషి చేస్తున్నారని తెలిపారు. తనకు లభిస్తున్న ప్రజాదరణను చూసి ప్రత్యర్థులు అసత్య ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆరోపణలు చేస్తూ ప్రగల్భాలు పలుకుతున్న వ్యక్తిని గ్రామ ప్రజలు విశ్వసించడం లేదని వ్యాఖ్యానించారు. కోలమూరు గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తానని పిన్నమరెడ్డి ఈశ్వరుడు ధీమా వ్యక్తం చేశారు.

చింతూరు డివిజన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

డిసెంబర్ నుంచి డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్‌పై కఠిన తనిఖీలు

15 రోజుల్లోగా వాహనదారులు తప్పనిసరిగా పత్రాలు పూర్తి చేసుకోవాలి

చింతూరు ఐటీడీఏ పీవో నరేంద్ర పడాల్





చింతూరు, నవంబర్ 16 ప్రభాత వార్త. చింతూరు డివిజన్‌లో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి, విలువైన ప్రాణాలను కాపాడేందుకు ఐటీడీఏ అధికారులు ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ప్రమాదకర ప్రాంతాలు, తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను చింతూరు ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ చిట్టపులి నరేంద్ర పడాల్, డీఎస్పీ ఉదయ్ పావని, పోలీస్, రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖ అధికారులతో కలిసి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదకర మలుపులు, రహదారుల వెడల్పు, రోడ్ల పరిస్థితి, వాహనాల రాకపోకలు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించారు. ప్రమాదాలకు కారణాలను గుర్తించి, వాటి నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు పీవో సూచించారు. బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు, రహదారి భద్రతా సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

డిసెంబర్ నుంచి కఠిన తనిఖీలు

ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చెల్లుబాటయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రతి వాహనానికి రిజిస్ట్రేషన్ ఉండాలని స్పష్టం చేశారు. లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ లేని వారు మరో 15 రోజుల్లోగా సంబంధిత రవాణా శాఖ కార్యాలయంలో ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ నెల నుంచి పోలీస్, రవాణా శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలను కఠినంగా అమలు చేస్తామని తెలిపారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపే వారిపై జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలు పాటించాలి.. ప్రాణాలు కాపాడుకోవాలి

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని పీవో సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగించడం మానుకోవాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదం ఒక కుటుంబాన్ని చిన్నాభిన్నం చేయడమే కాకుండా సమాజానికి తీరని నష్టాన్ని కలిగిస్తుందని, ప్రజలు రహదారి భద్రతను వ్యక్తిగత బాధ్యతగా భావించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ శాఖల చర్యలకు ప్రజల సహకారం తోడైతేనే ప్రమాదాలను సమర్థవంతంగా నివారించగలమని పేర్కొన్నారు.

అగ్నిప్రమాదంలో విద్యార్థిని పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్లు దగ్ధం

ఇల్లు కాలిపోవడంతో సర్వం బూడిద.. ఆందోళనలో విద్యార్థిని



చింతూరు, నవంబర్ 16, ప్రభాత వార్త: చింతూరు మండలం నిమ్మలగూడెం గ్రామంలో ఈ నెల 9వ తేదీన జరిగిన అగ్నిప్రమాదంలో ఓ విద్యార్థిని పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో కుయుగురు గ్రామానికి చెందిన అసు సంధ్యకు సంబంధించిన పదో తరగతి ఉత్తీర్ణత ధ్రువపత్రాలు పూర్తిగా కాలిపోయాయి. ప్రస్తుతం సంధ్య చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతూ కళాశాల హాస్టల్‌లో ఉంటోంది. దీపావళి పండుగ సందర్భంగా తన పిన్ని ఇంటికి వెళ్లిన సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అనుకోకుండా సంభవించిన అగ్నిప్రమాదంలో పూరిల్లు పూర్తిగా దగ్ధమై, ఇంట్లోని సామగ్రితో పాటు సంధ్యకు చెందిన పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్లు సైతం కాలి బూడిదయ్యాయి. విద్యాభవిష్యత్తుకు ఎంతో కీలకమైన ఒరిజినల్ సర్టిఫికెట్లు అగ్నికి ఆహుతి కావడంతో సంధ్య తీవ్ర ఆందోళనకు గురవుతోంది. సర్టిఫికెట్లు లేకపోవడంతో భవిష్యత్తులో విద్యా సంబంధిత అవసరాలకు ఇబ్బందులు ఎదురవుతాయేమోనని ఆవేదన వ్యక్తం చేస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి, విద్యార్థినికి అవసరమైన ధ్రువపత్రాల నకళ్లను పొందేందుకు సహకరించాలని స్థానికులు కోరుతున్నారు.

పురపాలక సంఘం - అమలాపురం

ఆర్.ఓ.సి.నెం.537/2025-ఎ1 తేది: 10-11-2026

బహిరంగ వేలం నోటీను

అమలాపురం పురపాలక సంఘంనకు చెందిన మున్సిపల్ కార్యాలయ మెయిన్ గేటు ప్రక్కన నూతనముగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఏక మొత్తముగా (సెలార్, గ్రౌండ్ ఫ్లోర్, మరియు 3అంతస్థుల కలిపి) మూడు సంవత్సరముల కాల పరిమితికి లీజుకిచ్చుటకు గాను ది.24.11.2026వ తేది,మంగళవారం ఉ.11.00 గంటలకు పురపాలక సంఘ కార్యాలయము నందు శ్రీయుత కమీషనరు వారిచే గాని లేక వారి అనుమతి పొందిన అధికారి వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. వేలమును ఆమోదించుటకు గాని లేక ఎట్టి కారణములు చూపకయే నిరాకరించుటకు గాని స్పెషల్ ఆఫీసర్/కమీషనర్ వారికి అధికారము కలదు.

క్ర.సం.	కాంప్లెక్స్ వివరములు	సర్కారు వారి పాట (రూ.)	సెక్యూరిటీ డిపాజిట్ (రూ.)	ధరావత్తు (రూ.)
1.	అమలాపురం పురపాలక సంఘంనకు చెందిన కార్యాలయ మెయిన్ గేటు ప్రక్కన నూతనముగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఏక మొత్తముగా (సెలార్, గ్రౌండ్ ఫ్లోర్, మరియు 3అంతస్థులు కలిపి) (పొడవు 45 చ.మ × వెడల్పు 81 చ.మ)	రూ.3,65,580/-	రూ.20,00,000/-	రూ.20,00,000/-

ఇతర వివరములకు కార్యాలయ పని వేళలలో రెవెన్యూ విభాగము నందు పొందగోరదమైనది.

కమీషనరు,
అమలాపురం పురపాలక సంఘం

జర్నలిస్టు నుంచి జనసేవకుడిగా సర్పంచ్ బరిలో బీర చిన్నారావు



ముమ్మిడివరం నవంబరు 16:ప్రభాతవార్త ముమ్మిడివరం మండలం కమిని గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలోకి స్వతంత్ర అభ్యర్థిగా బీర చిన్నారావు నిలిచారు. ఈ మేరకు ఆయన సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. దశాబ్దాలుగా జర్నలిస్టుగా పనిచేస్తున్న బీర చిన్నారావుకు గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలు, సామాజిక పరిస్థితులు, స్థానిక అవసరాలపై మంచి అవగాహన ఉంది. జర్నలిస్టుగా తన వృత్తి ప్రయాణంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను దగ్గరగా పరిశీలించడంతో పాటు, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సమస్యలపై అవగాహన కలిగిన ఆయన, ప్రజా ప్రతినిధిగా గ్రామ అభివృద్ధికి మరింత బాధ్యతతో పనిచేయాలనే ఉద్దేశంతో ఎన్నికల బరిలోకి దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు జర్నలిస్టుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన ఆయన, ఇకపై ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రత్యక్షంగా కృషి చేయాలనే లక్ష్యంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగాలన్నది ఆయన అభిలాషగా కనిపిస్తోంది. జర్నలిస్టుగా ప్రజా సమస్యలపై సంపాదించిన అనుభవం, గ్రామ ప్రజలతో ఉన్న పరిచయాలు ఎన్నికల్లో తనకు అనుకూలంగా మారుతాయని బీర చిన్నారావు ఆశాభావంతో ఉన్నారు. కమిని గ్రామ ఓటర్లు ఆయన అభ్యర్థిత్వాన్ని ఎలా స్వీకరిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ కె.చక్రవర్తి



అడ్డతీగల, నవంబర్ 16: పోలవరం జిల్లా అడ్డతీగల మండలంలో పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి నామినేషన్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అనంతరం ఎన్నికల అధికారి బాలుదొరను కలిసి ఇప్పటివరకు ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయి, నామినేషన్ ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతోందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర కుమార్, ఎస్సై బి. వినోద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ లారీ డీ ఉపాధి కూలీలకు గాయాలు.



రౌతులు పూడి నవంబర్ 16ప్రభాత వార్త రౌతులపూడి మండలం, శృంగవరం గ్రామంలోఉపాధి హామీ పనికి వచ్చే సమయంలో ఇద్దరు ఉపాధి వేతన దారులకు లారీ బలంగా ఢీ కొట్టడం తో.. వ తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం ఈగల సత్తిబాబు , అల్లు చిన్న బాబు రావులుజాతీయ ఉపాధి హామీ పనులకు కూలీలతో కలిసి వెళ తుండగా రౌతులపూడి నుంచి కత్తిపూడి వైపు వెళ్ళుచున్న క్వారీ లారీ డీ కొనడంతో బలమైన గాయాలు తగిలాయి.స్థానికులురౌతులపుడి ప్రభుత్వ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రధమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం తుని ఏరియా ఆసుపత్రికి రెఫెర్ చేశారు..బాధితులను ఉపాధి హామీ మండల ప్రోగ్రాం అధికారి .శివ రామ కృష్ణయ్య బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు.. మండల ఉపాధి హామీ అధికారిని బి.కాంచన బాధితులను తుని ఆసుపత్రిలో పరామర్శించి, సదరు విషయాన్ని జిల్లా కార్యాలయంకు తెలియజేసి నట్లు తెలిపారు.

18న రైతులకు ఉచితంగా చేప పిల్లల పంపిణీ



రాజమొమ్మంగి, నవంబరు 16, ప్రభాతవార్త రంపచోడవరం, రాజమొమ్మంగి పరిధిలోని ఫారంపాండ్ రైతులకు ఈనెల 18వ తేదీ బుధవారం ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేయనున్నారు. చేప పిల్లల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న రైతులకు పందిరిమామిడి చేప పిల్లల పెంపకం కేంద్రంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు.దరఖాస్తు చేసుకున్న రైతులందరూ ఆరోజు ఉదయం 7 గంటలలోపు కేంద్రానికి చేరుకోవాలని మత్స్య శాఖాధికారి హరీష్ సూచించారు. తప్పనిసరిగా ఆధార్ కార్డు ఒరిజినల్‌తో పాటు జిరాక్స్ కాపీని వెంట తీసుకురావాలని కోరారు.

వరుస తుఫాన్లతో ప్రజల అవస్థలు!

- విద్యుత్ కోతలు.. తాగునీటి కష్టాలతో సతమతం-మరమ్మతులకు నోచుకోని చేతిపంపులు..-అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆవేదన.







ఆత్రేయపురం నవంబర్ 16.ప్రభాత వార్త. అర్జున్, మురుసు వరుస తుఫాన్ల ప్రభావంతో ఆత్రేయపురం మండలంలోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో కరెంటు కోతలతో అల్లాడుతున్నారు. మరోవైపు పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. వాటర్ ట్యాంకుల నుంచి సరఫరా అవుతున్న నీరు పరిశుభ్రంగా ఉండటం లేదని, చేతిపంపులు మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఆక్వాన్ తుఫాను హెచ్చరికలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి చేతిపంపులకు మరమ్మతులు చేయించి, స్వచ్ఛమైన తాగునీటితో పాటు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జడ్డంగి శివాలయం వద్ద భారీ అన్నప్రసాద కార్యక్రమం





రాజమొమ్మంగి, నవంబరు 16, ప్రభాతవార్త రాజమొమ్మంగి మండలం జడ్డంగి శ్రీశ్రీశ్రీ భ్రమరాంభికా మల్లిఖార్జున స్వామి ఆలయం వద్ద కార్తిక సోమవారం సందర్భంగా అన్న దాన కార్యక్రమం జరిగింది. జడ్డంగి గ్రామస్తులు పూలపూడి రాంబాబు , పూలపూడి లక్ష్మి దంపతుల అల్లుడు, కుమార్తె లు అమెరికా వాస్తవ్యులు బంధం రాంబాబు, బంధం శ్రీలక్ష్మిలు ఈకార్యక్రమంను ఏర్పాటు చేశారు. 1,700 మంది భక్తులు మల్లిఖార్జునస్వామిని దర్శించుకొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భోజన తయారికి ముందు నిత్యావసర వస్తువులను జడ్డంగి పి. హెచ్. సి డా. పావని, పి. హెచ్. ఎన్ లు లక్ష్మి, వెంకటరమణ, ఎంపిహెచ్ ఇ. ఓ నాగవాసు పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ యూత్ సభ్యులు, గ్రామస్తులు భక్తులకు సహకారాన్ని అందించారు.

వేదమంత్రాల నడుమ వైభవంగా మాస కల్యాణాలు!

-ర్యాలి, ఆత్రేయపురం ఆలయాల్లో ప్రత్యేక వేడుకలు.. భక్తుల సందడి!



ఆత్రేయపురం, నవంబర్ 16 ప్రభాత వార్త: కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి, ఆత్రేయపురం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాల్లో శ్రావణ నక్షత్ర మాస కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ అర్చకులు స్వామివార్ల కల్యాణ క్రతువులను శాస్త్రోక్తంగా జరిపించారు. ర్యాలిలో ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈఓ దారపు రెడ్డి సురేష్ బాబు పట్టు వస్త్రాలు సమర్పించగా, ఆత్రేయపురంలో చైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణ రాజు, రాజ్యలక్ష్మి దంపతులు పట్టు వస్త్రాలు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఆత్రేయపురంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ర్యాలి ఆలయంలో తదుపరి మాస కల్యాణోత్సవం డిసెంబర్ 13న నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. భక్తులు రూ.750 చెల్లించి 99113 34733 నంబరు ద్వారా ఆన్‌లైన్‌లో కల్యాణ సేవకు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

తెలుగు భాషా సాహిత్య రంగానికి చేస్తున్న విశేష సేవలకు గుర్తింపు...



సఖినేటిపల్లి నవంబర్ 16, ప్రభాత వార్త: తెలుగు భాషా సాహిత్య పరిరక్షణ, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, వేలాదిమంది కవులు, రచయితలు, కళాకారులకు అండగా నిలుస్తున్న ప్రముఖ కవి, రచయిత, శ్రీ శ్రీ కళావేదిక వ్యవస్థాపక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కుమార్ ను రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఆదివారం విజయనగరంలోని గురజాడ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన విజయనగరం సాహితీ వైభవోత్సవాలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కత్తిమండ ప్రతాప్‌కు శాలువా కప్పి, ఘనంగా సత్కరించి ఆయన సాహిత్య సేవలను అభినందించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అనేక జిల్లాల్లో శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ ప్రతాప్ కుమార్ చేస్తున్న నిరంతరం సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వేలాదిమంది కవులకు, రచయితలకు వేదిక కల్పించడం అభినందనీయమన్నారు. మరుగున పడిన ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం, కొత్తతరం రచయితలను ప్రోత్సహించడం, తెలుగు భాషా సాహిత్య వికాసానికి కత్తిమండ ప్రతాప్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. విజయనగరంలో అనేక ప్రాంతాల నుండి వందలాది మంది కవులు రావడం ఆనందగా ఉందన్నారు. తెలుగు భాషా సాహిత్య రంగంలో ప్రతిభావంతులకు ప్రోత్సాహం అందిస్తూ, ప్రాంతాల కు అతీతంగా సాహిత్య సేవను విస్తరిస్తున్న శ్రీ శ్రీ కళావేదిక సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్, గురజాడ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణజీ, సంస్కృత కళాశాల ఉపాధ్యాయురాలు స్వప్న హిందవి , ఈపు విజయ్ కుమార్, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

కొత్తలంక సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన దాసరి సుమలత



ముమ్మిడివరం నవంబర్ 16 ప్రభాతవార్త ముమ్మిడివరం మండలం కొత్తలంక గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా దాసరి సుమలత సాయిబాబా సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. అయినాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలు వార్డుల మెంబర్లతో కలిసి దాసరి సుమలత సాయిబాబా నామినేషన్ దాఖలు చేశారు. గతంలో దాసరి సుమలత సాయిబాబా సర్పంచ్ గా పనిచేసిన కాలంలో కొత్తలంక గ్రామాన్ని ఎంతోఅభివృద్ధి చేశారు

కార్తీక కోటి సోమవారం.. శివాలయాలకు పోటెత్తిన భక్తులు!

- ర్యాలి, వాడపల్లి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు.. శివనామస్మరణతో మారుమోగిన క్షేత్రాలు



ఆత్రేయపురం, నవంబర్ 16 ప్రభాత వార్త: ర్యాలిలోని శ్రీ ఉమా కమండలేశ్వర స్వామివారి ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బండెల సత్తిపండు, ఈఓ దారపు రెడ్డి సురేష్ బాబు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి ఏర్పాట్లు చేశారు.అలాగే కోనసీమ తిరుమల వాడపల్లి ఆలయ ప్రాంగణంలోని శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామివారి ఆలయంలో మేలుకొలుపు సేవ, పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన జరిపి భక్తులకు దర్శనాలు కల్పించారు. అనంతరం భక్తులు నిత్య అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు మాట్లాడుతూ కార్తీక మాసమంతా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పెదపట్నంలంక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఆర్థిక సహాయం.



మామిడికుదురు .నవంబర్16 ప్రభాతవార్త:విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని శ్రీశరత్ చంద్ర ఫౌండేషన్ ఫౌండర్ కొమ్ముల శ్రీనివాసరావు,సీఈఓ కొమ్ముల రాణి పిలుపునిచ్చారు. పెదపట్నంలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎ. ఏడుకొండలు అధ్యక్షతన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26 విద్యా సంవత్సరం వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న 11 మంది విద్యార్థులకు ఫౌండేషన్ తరపున మొత్తం రూ. 23,200/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ముఖ్యంగా, పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని బొలిశెట్టి దుర్గా భవానిని నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.విద్యార్థుల చదువును ప్రోత్సహిస్తూ ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న శరత్ చంద్ర ఫౌండేషన్ సేవలను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేకంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆకేటి సత్యనారాయణ తోపాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యలింగేశ్వరునికి ఘనంగా లక్ష బిల్వార్చన



మామిడికుదురు. నవంబర్16 ప్రభాతవార్త) శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు భారీగా తరలి వచ్చారు. శివాలయాల్లో అభిషేకాలు చేయించుకున్నారు. పెదపట్నంలంక గ్రామంలోని శ్రీఉమా సత్యలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు ఆదిరాజు రఘునాథశర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, సత్యలింగేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఉమాదేవికి లక్ష కుంకుమార్చన కన్నుల పండుగలా జరిపించారు.లక్ష మారేడు దళాలతో సత్యలింగేశ్వరునికి అర్చన చేశారు.నీరాజన మంత్ర పుష్పం,సూర్య నమస్కారాలు,చండీ హోమం,రుద్ర హోమం, జ్యోతిర్లింగార్చన తదితర పూజా కార్యక్రమాలను వైభవోపేతంగా జరిపించారు.పలువురు భక్త దంపతులు లక్ష బిల్వార్చన పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు.

దీపావళి కానుకల పంపిణీలో అవకతవకలు

480 రేషన్ కార్డులకు గాను 430 కార్డులకే సరుకులు.. మిగిలిన 50 కార్డుల కానుకలు ఎక్కడ?



యానాం,నవంబర్16(ప్రభాతవార్త):దీపావళి పండుగ సందర్భంగా ప్రభుత్వం ప్రజలకు అందించాల్సిన కానుకల పంపిణీలో తీవ్ర లోటుపాట్లు చోటుచేసుకున్నాయని ఆర్ఎల్‌పీఐ ఎంకే పార్టీ జనరల్ సెక్రటరీ నందికి లోవరాజు ఆరోపించారు. యానాం పరిధిలోని పరంపేట గ్రామం 7వ వార్డులో ఉన్న రేషన్ షాపులో ఈ అవకతవకలు జరిగినట్లు ఆయన తెలిపారు. సదరు రేషన్ షాపు పరిధిలో మొత్తం 480 రేషన్ కార్డులు ఉండగా, కేవలం 430 కార్డులకు మాత్రమే దీపావళి కానుకల సరుకులు వచ్చినట్లు పేర్కొన్నారు. మిగిలిన 50 కార్డులకు సంబంధించిన సరుకులు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపై రేషన్ షాప్ డీలర్‌ను ప్రశ్నించగా, సివిల్ సప్లై కార్యాలయం నుంచి ఎన్ని సరుకులు వచ్చాయో వాటినే పంపిణీ చేశామని, దీనికి తనకు సంబంధం లేదని సమాధానం ఇస్తున్నారని తెలిపారు. అదేవిధంగా కనుమ కార్డులకు సంబంధించిన వివరాలు అడిగినా సరైన సమాచారం ఇవ్వకుండా బాధ్యతను అధికారులపైకి నెట్టేస్తున్నారని విమర్శించారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే పండుగ కానుకలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. సివిల్ సప్లై శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పరంపేట 7వ వార్డులోని సంబంధిత రేషన్ షాపును స్వయంగా సందర్శించి, స్టాక్ రిజిస్టర్, సరుకుల నిల్వలు, పంపిణీ వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపు పరిధిలో వాస్తవంగా ఎన్ని కార్డులు ఉన్నాయో, వాటికి అనుగుణంగా ఎంతమేర సరుకులు కేటాయించారో, తూకంతో సహా తనిఖీ చేయాలని కోరారు. 480 కార్డులకు గాను 430 కార్డులకే సరుకులు పంపిణీ చేయడానికి గల కారణాలను వెల్లడించాలని, మిగిలిన 50 కార్డుల లబ్ధిదారులకు రావాల్సిన కానుకల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఇకపై ప్రతి రేషన్ షాపుకు కార్డుల సంఖ్య ఆధారంగా పూర్తిస్థాయిలో సరుకులు కేటాయించి, పారదర్శకంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని నందికి లోవరాజు కోరారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

కొత్తపేట, నవంబర్16, (ప్రభాతవార్త) భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు


-శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



కొత్తపేట, నవంబర్16, (ప్రభాతవార్త) పవిత్ర కార్తీక మాసం తొలి రోజున ఈ సోమవారం సందర్భంగా కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని శైవక్షేత్రాలన్నీ భక్తజన సందోహంతో కిటకిటలాడాయి ఎక్కడ చూసినా హరహర మహాదేవ ఓం నమఃశివాయ శంభో శంకర నామస్మరణలు మార్మోగగా ఆలయాలన్నీ భక్తి పారవశ్యంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి నియోజకవర్గంలోని ప్రసిద్ధ స్వయంభూ పుణ్యక్షేత్రమైన మండల పరిధిలోని పలివెల గ్రామంలోని శ్రీ ఉమా కొప్పేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ స్వామివారికి పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు కార్తీక సోమవారం కావడంతో భక్తుల రద్దీ భారీగా మరింతగా పెరిగింది దీంతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో భక్తులు క్రమపద్ధతిలో స్వామివారిని దర్శించుకున్నారు మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో దీపారాధనలు నిర్వహించారు ఆలయ ఈ ఓ పి కామేశ్వరరావు పర్యవేక్షణలో దేవస్థాన సిబ్బంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టి దర్శన ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు అదేవిధంగా భక్తుల సహకారంతో దేశ్వస్థానం నందు ఏర్పాటు చేసిన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని తోట వెంకటేశ్వరావు తన సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు పవిత్ర కార్తీక మాసంలో తొలి సోమవారం కావడంతో పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి ఆలయం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది భక్తుల రాకతో ఆలయ పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి

లక్షతులసి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట నవంబర్ 16 (ప్రభాతవార్త). మండపేట పట్టణంలోని సర్దార్ వేగుళ్ల వీర్రాజు సెంటర్ (కలువపువ్వు సెంటర్) వద్ద కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం లక్షతులసి పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఎమ్మెల్యేకు వేదాశీర్వచనం అందించగా, ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాన్ని అందజేశారు. తోలుతా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు.



ఎంపీటీసీ దివ్య కుఘన నివాళులు అర్పించిన

-జనసేన ఇన్చార్జ్ దొడ్డి గర్ల సువర్ణ రాజు



దేవరపల్లి నవంబర్ 16 (ప్రభాతవార్త) దేవరపల్లి మండలం దుమంతునిగూడెం గ్రామానికి చెందిన గారపాటి దివ్య జనసేన పార్టీ ఎంపీటీసీ గా విజయం సాధించి ఆ విజయాన్ని చూడకుండానే అకాల మరణం పొందింది సోమవారం గారపాటి దివ్య కుటుంబ సభ్యులు ఆదరణ కూడిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు పాల్గొని. దివ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గారపాటి ప్రసాదరావు. గారపాటి యోహాను. జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు గుడిసె పోసి వెంకటరత్నం, నాయకులు పల్లంట్ల పాండు, అనిశెట్టి ఆదిత్య, అనిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శివ నామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

-దుర్గాడ శివాలయంలో 108 కేజీలతో బస్మాభిషేకం
గొల్లప్రోలు,తాటిపర్తి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గొల్లప్రోలు, నవంబర్ 16,(ప్రభాత వార్త)



కార్తీక మాసం పర్వదినాన్ని పురస్కరించుకుని గొల్లప్రోలు మండల పరిధిలోని పలు శైవక్షేత్రాల్లో సోమవారం ప్రత్యేక పూజలు,అభిషేకాలు అత్యంత వైభవంగా జరిగాయి.తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు బారులు తీరడంతో ఆలయ ప్రాంగణాలన్నీ శివనామస్మరణతో మారుమోగాయి.దుర్గాడ గ్రామంలోని పురాతన శివాలయంలో వేంచేసియున్న శివయ్యకు కోటి సోమవారం,సప్తమి తిథి,శ్రవణ నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు,దత్తు సోదరుల ఆధ్వర్యంలో 108 కేజీల భస్మంతో (విభూది) మహా భస్మాభిషేకం, భస్మాలంకరణ నిర్వహించారు.ఆలయ స్వర్ణోత్సవ,బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న 108 రోజుల భజన కార్యక్రమంలో భాగంగా 86వ రోజున ఈ విశేష పూజలు జరిపారు.అనంతరం స్వామివారికి పుష్పమాలలతో అలంకరించి,నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు.చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ సేవా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గొల్లప్రోలు ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో గొల్లప్రోలు పట్టణ పరిధిలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచే భక్తులు క్యూ లైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తాటిపర్తి నాగేశ్వర స్వామికి ఘనంగా పసుపు అలంకరణ గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో వేంచేసియున్న శ్రీ అపర్ణా సమేత నాగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.పర్వదినాన్ని పురస్కరించుకుని నాగేశ్వర స్వామి వారికి అత్యంత ఘనంగా పుష్ప అలంకరణ చేశారు.వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ,వేద పండితులు దైవజ్ఞరత్న ఆకొండి వెంకటేశ్వర శర్మ, ప్రధాన అర్చకులు ఆకొండి ప్రభాకర్ శాస్త్రి, కమిటీ సభ్యులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చింతూరు కేంద్రంగా జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలి

**ముఖ్యమంత్రి నారా చ

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

18 నుండి పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ

-ఎంపీడీవో సెలెట్ రాజు



గొల్లప్రోలు, నవంబర్ 16.(ప్రభాత వార్త) గొల్లప్రోలు మండల పరిధిలోని గ్రామపంచాయతీ సర్పంచ్,వార్డు సభ్యుల ఎన్నికకు ఈనెల 18వ తేదీ నుండి నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో సెలెట్ రాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని 10 గ్రామ పంచాయతీ సర్పంచ్,వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో 18 నుండి 20వ తేదీ వరకు మూడు రోజులు నామినేషన్లు స్వీకరిస్తామని ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చునని తెలిపారు. 21న నామినేషన్ల పరిశీలన జరుగుతుందని,నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు 24 ఆఖరు తేదీ అని తెలిపారు. 29న సర్పంచ్,వార్డు సభ్యుల ఎన్నికకు పోలింగ్ జరుగుతుందని వివరించారు.అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు జరిపి విజేతలను ప్రకటిస్తామని తెలిపారు.ఎక్కడైనా రీపోలింగ్ అవసరమైతే 30వ తేదీన నిర్వహిస్తామని ఎంపీడీవో వివరించారు.

ఉప్పంగల సర్పంచ్ అభ్యర్థిగా సువర్ణలత నామినేషన్.



తాళ్లరేవు నవంబర్ 16(ప్రభాతవార్త): తాళ్లరేవు మండలంలో శివారు ప్రాంతమైన ఉప్పంగల గ్రామ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థిగా దడాల సువర్ణలత సోమవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి వి.గిరిబాబుకు తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.అంతకుముందు కూటమి నేతలు ముత్యాల జయలక్ష్మి, గుత్తాల మహాలక్ష్మి, పంపన శ్రీను విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు నేతృత్వంలో సర్పంచ్ అభ్యర్థి దడాల సువర్ణలతను అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజలందరూ తనను ఆదరించి ఓట్లు వేసి తనకు విజయం చేకూర్చాలని సువర్ణలత విజ్ఞప్తి చేశారు.

రక్ష హరికృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లికి వందనం కార్యక్రమం విద్యార్థులకు అదనపు తరగతులు, ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి



యానాం, నవంబర్ 16 (ప్రభాతవార్త): యానాంలోని గెరియంపేట రక్ష హరికృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల విద్యాభివృద్ధి, కళాశాలలో మెరుగైన విద్యాబోధన, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై తల్లిదండ్రులు, అధ్యాపకులు చర్చించారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు నూతన పాఠశాల దుస్తులు అందించాలని కోరారు. నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణతో కూడిన అదనపు తరగతులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులపై అధ్యయన భారం పెరగకుండా, ప్రతి సబ్జెక్టుపై సమగ్ర అవగాహన కల్పించేందుకు అదనపు అధ్యాపకులను నియమించాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించి, నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు సూచించారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు పరస్పర సమన్వయంతో పనిచేసినప్పుడే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని సమావేశంలో అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు, అధ్యాపకులు సత్యవాణి, పీవీఎస్ ప్రకాష్, దుర్గమ్మ, సునీత బాల, బొబ్బిలి ప్రసాద్, నున్న సురేష్, గ్రంధి సునీత, జాలం శ్రీనివాసరావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు, విద్యార్థులు హాజరయ్యారు.

నర్సింగ్ అధికారుల డిమాండ్ల పరిష్కారానికి పోస్ట్‌కార్డు ఉద్యమం లెఫ్టినెంట్ గవర్నర్, ప్రధాన కార్యదర్శికి వినతులు



యానాం, నవంబర్ 16(ప్రభాతవార్త): పుదుచ్చేరి ప్రభుత్వ నర్సింగ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో యానాం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చెందిన నర్సింగ్ అధికారులు సోమవారం తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ లెఫ్టినెంట్ గవర్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పోస్ట్‌కార్డులు పంపించారు.ఈ సందర్భంగా నర్సింగ్ అధికారులు మాట్లాడుతూ.. సంక్షోభ సమయాల్లో ప్రభుత్వానికి అండగా నిలిచామని, కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందించామని తెలిపారు. దేశ పునరుద్ధరణలో నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషించారని పేర్కొంటూ, ప్రస్తుతం తమ సమస్యలను పరిష్కరించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా నాలుగు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఖాళీగా ఉన్న అన్ని రెగ్యులర్ నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలని, తాత్కాలిక, కాంట్రాక్టు నియామకాలను తక్షణమే నిలిపివేయాలని కోరారు. అన్ని స్థాయిల్లో నర్సింగ్ అధికారులకు సకాలంలో పదోన్నతులు కల్పించాలని, పెంచిన నర్సింగ్ అలవెన్సులకు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.నర్సింగ్ అధికారుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, నాలుగు డిమాండ్ల పరిష్కారానికి తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని యానాం ప్రభుత్వ ఆసుపత్రి నర్సింగ్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

మన్యంలో బాల్య వివాహాల నిర్మూలనలో పురోగతి సాధించాం

-ఎపి బాలల హక్కుల కమీషన్ సభ్యులు వి గాంధీబాబు



వి.ఆర్.పురం,నవంబర్16.ప్రభాతవార్త మన్యంలో బాల్య వివాహాల నిర్మూలనలో తాము ఆశించిన మేర పురోగతి సాధించామని, ఇది అందరి సమిష్టి కృషి అని, ఎపి బాలల హక్కుల కమీషన్ సభ్యులు, రేఖపల్లి ఎ.ఎస్.డి.ఎస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఉండవల్లి గాంధీబాబు సంతృప్తిని వ్యక్తం చేశారు. సోమవారం రేఖపల్లి ఎ.ఎస్.డి.ఎస్ కార్యాలయంలో నవంబర్ 14 భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకొని, బాలల దినోత్సవం వేడుకలను పండుగ వేడుకలా ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో వి.ఆర్.పురం, కూనవరం , ఎటపాక , చింతూరు మండలాలలోని తొమ్మిది కళాశాలలు నుండి పెద్ద సంఖ్యలో చిన్నారులు తరలివచ్చి, వివిధ సాంస్కృతిక, కళా ప్రదర్శనలు ఇచ్చారు. చిన్నారుల వేషధారణలు, కళా ప్రదర్శనలు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ గాంధీబాబు మాట్లాడారు. గడిచిన 25 ఏళ్ళుగా సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టి గిరిజనులను ఆర్థిక, సామాజిక, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధి వైపు మరల్చామన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టి, గిరిజన బాలికలు ఉన్నత చదువులు చైవేందుకు కృషి చేశామన్నారు. ఫలితంగా అనేక గ్రామాల్లో నేడు గిరిజన యువతి, యువకులు ఉన్నత చదువులు చదువుతూ, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎపి బాలల హక్కుల కమీషన్ సభ్యులు వి సూర్యనారాయణ రాజు గారు మాట్లాడారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన వి.ఆర్.పురం మండలంలో ఎ.ఎస్.డి.ఎస్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. సంస్థ సేవలను అభినందించారు. అనంతరం చిన్నారులకు, ప్రభుత్వ విద్యార్థులు, ఉత్తమ ఉపాధ్యాయుల కు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమీషన్ సభ్యులు వెంకట పద్మలత, డాక్టర్ పి నాగ మానస, ఎ.పి.ఎస్.సి.పి.సి.ఆర్ ఎం సూర్యనారాయణ, చల్ల మధుసూన్ రావు, స్థానిక తహసీల్దార్ సరస్వతి, ఐసిడిఎస్ సిడిపిఒ మల్లిక, లక్ష్మపురం ఎకలవ్య స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ దలిఫ్, స్థానిక ఐసిడిఎస్ సూపర్వైజర్లు నాయోమీ రాణి, ఎ.ఎస్.డి.ఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ సాత్విక్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం మేయర్ బరిలో అజ్జరపు శ్రీనివాసరావు

-అట్టహాసంగా సాగిన నామినేషన్ ర్యాలీ.. భారీగా తరలివచ్చిన అభిమానులు



రాజమహేంద్రవరం అర్బన్: నవంబర్16, ప్రభాత వార్త. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో మేయర్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా అజ్జరపు శ్రీనివాసరావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు.క్వారీ ఏరియాలోని ఆయన నివాసానికి ఉదయం నుంచే అభిమానులు, యువత, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. తొలుత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, క్వారీ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డప్పు వాయిద్యాలు, నినాదాల మధ్య భారీ ర్యాలీగా నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకుని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయ పార్టీల అండ లేకపోయినా ప్రజల ప్రేమాభిమానాలే తన బలమన్నారు. పారదర్శక, అవినీతిరహిత పాలన అందించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం మెరుగుపరచడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తన లక్ష్యమని తెలిపారు. రాజమహేంద్రవరాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ మేయర్ అభ్యర్థిగా రేలంగి రాణి శ్రీదేవి నామినేషన్

-అట్టహాసంగా ర్యాలీ.. కూటమి శ్రేణులు, వివిధ సంఘాల ప్రతినిధుల భారీ తరలింపు-రెండో విడతలో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధిస్తాం: పీవీఎన్ మాధవ్ - అభివృద్ధి అంటే బీజేపీనే: సోము వీర్రాజు



రాజమహేంద్రవరం అర్బన్, నవంబర్ 16: ప్రభాతవార్త. రాజమహేంద్రవరం మేయర్ పదవికి టీడీపీ, జనసేన మద్దతుతో బీజేపీ అభ్యర్థి రేలంగి రాణి శ్రీదేవి సోమవారం భారీ ర్యాలీ మధ్య నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితర ప్రముఖులు ఆమె వెంట వచ్చారు.తొలుత వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, కంబాలచెరువు వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడి నుంచి గోకవరం బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ఊరేగింపు నిర్వహించి, అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ తొలి విడత మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్ట్రైక్ రేట్ సాధించామని, రెండో విడతలో వంద శాతం లక్ష్యంగా ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు. రేలంగి శ్రీదేవి పార్టీకి అంకితభావంతో పనిచేసిన క్రియాశీలక కార్యకర్త అని పేర్కొన్నారు.ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, మేయర్ అభ్యర్థితో పాటు కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రానున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా నగరాభివృద్ధికి కేంద్ర నిధులు తీసుకురావడంలో కూటమి విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు.

వైభవంగా సహస్ర లింగార్చన



అంబాజీపేట,నవంబర్ 16.(ప్రభాతవార్త): కార్తీకమాసం సందర్భంగా కోటి సోమవారం సందర్భంగా సహస్ర లింగార్చన నిర్వహించడం అన్ని విధాలా శ్రేయస్కరమని ప్రముఖ వేదంపండితులు సుసర్ల ఫణి శాస్త్రి అన్నారు. కార్తీక మాసంలో సోమవారం, శ్రవణం నక్షత్రం కలిసి వస్తే ఆ రోజును కోటి సోమవారం అంటారని, ఫణి శాస్త్రి పేర్కొన్నారు.ఇలాంటి సోమవారం 150 ఏళ్ళ క్రితం అంటే 1876 లో కోటి సోమవారం సంభవించిందని మరలా ఇన్నేళ్లకు వచ్చిందన్నారు.ఈ రోజున పరమేశ్వరునికి భక్తితో నమస్కరించినా,అభిషేకించినా ఎంతో పుణ్యఫలం లభిస్తుందన్నారు. ఎంతో పవిత్ర మైన కోటి సోమవారం నాడు అంబాజీపేట పెద్దవీధిలోని దీక్షిత్ నగర్ కు చెందిన వాడ్రేవు సూర్యనారాయణమూర్తి-సత్య భాను దంపతులు సహస్ర లింగార్చన నిర్వహించడం ఎంతో పుణ్యఫలమన్నారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు వేదనభట్ల రామకృష్ణశర్మ, ఎం.రమేష్ లు పాల్గొన్నారు. కాగా కందాళ శర్మ ప్రత్యేకంగా సూర్య నమస్కారాలు నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు కుంకుమ పూజలు నిర్వహించి, లలితా సహస్ర పారాయణ గావించారు.

గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్



రామచంద్రపురం,నవంబరు 16 (ప్రభాతవార్త): రెండో విడతలో భాగంగా ఈ నెల 29న రాష్ట్రంలోని తొమ్మిది మండలాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు.ఇందులో భాగంగా రామచంద్రపురం మండలంలోని 25 గ్రామపంచాయతీలకు ఎన్నికల నిర్వహణకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఎంపీడీవో కె.పద్మజ్యోతి,డిప్యూటీ ఎంపీడీవో ఎం.శివప్రసాద్ నోటిఫికేషన్‌ను మండల పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డులో ప్రదర్శించారు.ఈ నెల 18 నుంచి 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత గ్రామపంచాయతీల్లో నామినేషన్లు స్వీకరించనున్నారు. 21వ తేదీ ఉదయం 8గంటల నుంచి నామినేషన్ల పరిశీలన చేపడతారు.తిరస్కరణకు గురైన నామినేషన్లపై అప్పీలు చేసుకునేందుకు 22వ తేదీ అవకాశం కల్పించారు.అభ్యర్థుల ఉపసంహరణకు 24వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు గడువు ఉంది.అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. 29వ తేదీ ఉదయం 7నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు.అదే రోజు మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు.సర్పంచ్ ఎన్నిక ఫలితం ప్రకటించిన అనంతరం ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నారు.ఎన్నికల ప్రక్రియలో కోర్టు వివాదాలు,ఇతర అభ్యంతరాలు తలెత్తితే వాటిపై నిర్ణయం తీసుకునే అధికారాలను జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారికి రాష్ట్ర ఎన్నికల సంఘం కల్పించింది.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


సీతానగరం, నవంబర్ 16, (ప్రభాతవార్త) : మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సిఫార్సుతో సీఎం సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తుందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సహాయాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమేశ్వరుడి దర్శనానికి పోటెత్తిన భక్తజనం



రామచంద్రపురం,నవంబరు 16 (ప్రభాతవార్త): కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ద్రాక్షారామంలోని శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని,అమ్మవారిని దర్శించుకున్నారు.భక్తుల శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు,అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.మహిళా భక్తులు అరటి డొప్పలపై కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.ఆలయ ప్రాంగణంలోని అశ్వత్థ వృక్షం పద్ద ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.భక్తుల రాకతో క్యూ లైన్లు కిటకిటలాడాయి.ఈవో అల్లు దుర్గాభవాని పర్యవేక్షణలో ఆలయ అధికారులు,సిబ్బంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేశారు.క్యూ లైన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టారు.పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ బందోబస్తు నిర్వహించారు.

సీలేరు సర్పంచ్ ఎన్నికల బరిలో కొర్ర స్వాతి !



మోతుగూడెం నవంబరు:16 ప్రభాతవార్త టీడీపీ, బీజేపీ మద్దతుతో సీలేరు సర్పంచ్ గా పోటీ చేసేందుకు 22 ఏళ్లకే ఎన్నిక బరిలోకి కొర్రస్వాతి ని పార్టీ సబ్యులు మద్దతు పలికారు అల్లూరి సీతారామరాజు జిల్లా, జి.కె.వీధి మండలం, సీలేరు మేజర్ గ్రామపంచాయతీలో 22 ఏళ్ల యువతి కొర్ర స్వాతి సర్పంచ్ ఎన్నికల బరిలో నిలవడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది. సీలేరులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న కొర్ర ధనుంజయ్ కుమార్తె స్వాతి. యువత రాజకీయాల్లోకి రావాలని, గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే సంకల్పంతో ఆమె సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఆమెకు తెలుగుదేశం పార్టీ (టీడీపీ), భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు మద్దతు ప్రకటించారు.సోమవారం టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కొర్ర స్వాతి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.చిన్న వయసులోనే ప్రజాసేవ లక్ష్యంగా రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న స్వాతికి కూటమి నాయకులు మద్దతు ప్రకటించడం సీలేరు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పిస్తూ, గ్రామాభివృద్ధి కోసం కొత్త నాయకత్వం ముందుకు రావడం అభినందనీయమని పలువురుఅభిప్రాయపడుతున్నారు.ఈ నామినేషన్ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కారే అప్పలరాజు, టీడీపీ నాయకులు చిటికెల రాము, గోరింట పిలోన్, టి. నాగేంద్రబాబుతో పాటు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచ్చిలి సర్పంచ్ అభ్యర్థిగా ఇందుకూరి సీతారామరాజు!

-ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలిసి కృతజ్ఞతలు తెలిపిన పెద్ద రాము



ఆత్రేయపురం, నవంబర్ 16 ప్రభాతవార్త: ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామ సర్పంచ్ పదవికి కూటమి అభ్యర్థిగా ఇందుకూరి సీతారామరాజు (పెద్ద రాము) ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం వాడపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ఎంపీపీ తోటకూర సుబ్బరాజు, మండల తెలుగు యువత అధ్యక్షుడు వెచ్చా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేయర్ అభ్యర్థిగా బి. అన్విత ఖరారు

-మాజీ ఎంపీ హర్షకుమార్ కోడలికి పార్టీ అధిష్టానం అవకాశం



రాజమహేంద్రవరం అర్బన్: నవంబర్ 16, ప్రభాతవార్త. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున బి. అన్విత (అన్విత వ్లాగ్స్) ఖరారయ్యారు. మాజీ ఎంపీ హర్షకుమార్ కోడలు, శ్రీరాజ్ సతీమణి అయిన అన్విత పేరును కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించింది.అన్విత ప్రస్తుతం రాజమహేంద్రవరం ప్రకృతి వేదిక వైస్ చైర్మన్‌గా, రాజీవ్ గాంధీ విద్యాసంస్థల డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బీటెక్‌తో పాటు ఎల్ఎల్బీ, ఎల్ఎల్ఎం ఉన్నత విద్యను అభ్యసించారు.సోషల్ మీడియా రంగంలోనూ ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అన్విత వ్లాగ్స్ పేరుతో తెలుగు కంటెంట్ క్రియేటర్‌గా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకుల ఆదరణ పొందుతున్నారు. విద్యారంగం, సామాజిక కార్యక్రమాలు, సోషల్ మీడియా రంగాల్లో గుర్తింపు పొందిన అన్వితకు కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించడం నగర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

మోడరన్ విద్యార్థి ప్రతిభ



రామచంద్రపురం, నవంబరు 16 (ప్రభాతవార్త): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో మోడరన్ జూనియర్ కళాశాల విద్యార్థి కొడమంచిలి హర్షతేజ ప్రతిభ చాటాడు.ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు అనంతపురం జిల్లా లేపాక్షిలోని జవహర్‌లాల్ విద్యాలయంలో నిర్వహించిన 70వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించాడు.జట్టు రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు.ఈ విషయాన్ని మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు సోమవారం వెల్లడించారు.ఈ సందర్భంగా హర్షతేజను ఆయనతో పాటు ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్,పీఈటీ మోహనకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గొప్ప క్రీడాకారుడిగా ఎదగాలని జి.వి.రావు ఆకాంక్షించారు.

స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు కో-ఆప్షన్ పదవులు ఇవ్వాలి

-దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు



గొల్లప్రోలు, నవంబర్ 16.(ప్రభాత వార్త)రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్థానిక సంస్థల పాలకవర్గాలలో దివ్యాంగులకు కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించాలని రాష్ట్ర దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సేవాసమితి అధ్యక్షుడు ఉలవశెట్టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం గొల్లప్రోలులో ఆయన విలేకరులతో మాట్లాడారు.దివ్యాంగుల హక్కుల చట్టాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు.ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన ఏడు హామీలలో కో-ఆప్షన్ సభ్యుల నియామకం కూడా ఒకటని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు,కార్పొరేషన్ల పాలకవర్గ కమిటీలలో నామినేటెడ్ పోస్టులైన కో-ఆప్షన్ సభ్యులుగా దివ్యాంగులను ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు.దివ్యాంగులు రాజకీయాలలో రాణించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు సూచించారు. ముఖ్యంగా ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన దివ్యాంగులకు ఆయా స్థానిక సంస్థల్లో కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పిస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు.దివ్యాంగుల సామాజిక,ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వారికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేలా ముఖ్యమంత్రి తక్షణమే సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.అనంతరం గొల్లప్రోలు నగర పంచాయతీ పాలకవర్గంలో స్థానిక దివ్యాంగులకు కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించాలని కోరుతూ పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) కార్యాలయంలో అధికారులకు శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు.

జనసేనలోకి పిచ్చుకల రవికుమార్